మామిడికుదురులో అన్న సమారాధన

ప్రజాశక్తి - మామిడికుదురు

మామిడికుదురులో నూకా లమ్మ జాతరను పురస్కరించుకొని శుక్రవారం ఆలయ ప్రాంగణంలో నయినాల కుటుంబం ఆధ్వర్యంలో అన్నదాన నిర్వహించారు. నయినాల రాములు, వెంకటరెడ్డి, జగన్నాథం, రంగారావు, బుల్లియ్య, గోపాలరావు కుటుంబ సభ్యుల సహకారంతో దీన్ని ఏర్పాటు చేశారు. మూడువేల మందికిపైగా పాల్గొన్నారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, ఎ1 సేవా సమితి అధ్యక్షుడు సిహెచ్. శ్రీనివాస్,సర్పంచ్ సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, మామిడికుదురు సర్పంచ్ గొస్ మొహిద్దీన్, ఎంపిపి కుసుమ వనజకుమారి, ఎంపిటిసిలు నయినాల సీతామహాలక్ష్మి, వర్ధినేని తులసీరామ్, ఎంపిటిసిల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గా ప్రసాద్, టిడిపి మండల అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లపై నిరంతర నిఘా

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి - అమలాపురం

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, దీని కోసం స్కానింగ్ సెంటర్లపై నిరంతర నిఘాను పెట్టాలని కలెక్టర్ హిమాన్షుశుక్లా కమిటీ సభ్యులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో డిఎం అండ్ హెచ్ఓ అధ్యక్షతన లింగ నిర్ధారణ నిషేధ చట్టం–1994 అమలుపై మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ, నఫస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా అజెండాలోని ప్రతిపాదించిన అంశాలను అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ పిండ ఆరోగ్య స్థితిగతులు పరిశీలన కోసం వినియోగించే వైద్య పరీక్షలను ఎట్టి పరిస్థితుల లోనూ లింగ నిర్ధారణ కోసం దుర్వినియోగం కాకుండా అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలన్నారు. డెకాయ్ ఆపరేషన్లు నిబంధనల మేరకు నిర్వహించాలని కమిటీ సభ్యులకు సూచించారు. లింగ నిర్ధారణను వెల్లడిస్తున్న సౌండ్ స్కానింగ్ కేంద్రాలపై చర్యలు తీసుకోవడంతో పాటు సక్రమంగా రికార్డులు నిర్వహించని కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని డిఎంఅండ్హెచ్ఓని ఆదేశించారు. భ్రూణ హత్యలకు పాల్పడడాన్ని నిలువరించాలన్నారు. జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహిస్తూ చట్టాన్ని పటిష్టంగా అమలు పరచాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సిసెక్షన్ ఆపరేషన్లు అనగా సుఖప్రసవాలు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ సిజేరియన్ చేయడంపై తనిఖీలు నిర్వహించాలన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం ఫిర్యాదుల కోసం డిఎంహెచ్ఓ కార్యాలయంలోనూ టోల్ ఫ్రీ నెంబరును త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. కమిటీ సభ్యులు గ్రామ మండల డివిజన్ స్థాయిల్లోనూ అనధికారికంగా జరుగుతున్న అబార్షన్లపై గుర్తించి లింగ నిర్ధారణ నిషేధిత చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి పిసి, పిఎన్డిటి చట్టానికి సంబంధించిన బోర్డులను, వాల్పోస్టర్లను ప్రధాన కూడళ్లలో తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. ఆడపిల్లల పట్ల వివక్షతను రూపు మాపుతూ స్త్రీ పురుష లింగ నిష్పత్తి సమానత్వ సాధన ద్వారా ఆరోగ్యకర సమాజ స్థాపనకు పాటుపడాలన్నారు. స్వచ్ఛంద సంస్థ సహకారంతో లింగనిర్ధారణ నిషేధిత చట్టం అమలు విధి విధానాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం పరిధిలోని లక్ష్యాల సాధనకు పటిష్టమైన చర్యలు గైకొనాలన్నారు. లింగ వివక్షతకు తావు లేకుండా చర్యలు గైకొని లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని స్పష్టం చేశారు నిబంధనలు ఉల్లంఘించిన వారి యంత్రాలు పరికరాలను స్వాధీనం చేసుకోవడం, చట్టపరమైన చర్యలు తీసుకోవడం చేయాలన్నారు. స్థానికంగా ఉన్న రోహిణి సంతాన సాఫల్య కేంద్రానికి కొత్తపేటలో ఉన్న భాస్కర్ సంతాన సాఫల్య కేంద్రానికి అనుమతులు ఇచ్చామన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పి కె.లతామాధురి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సత్యనారాయణ, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి జివి.సత్యవాణి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.లక్ష్మీనారాయణ, ప్రసూతి వైద్యులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు, ఇన్సెట్లో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

వైద్య పరీక్షలు సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - అమలాపురం

విద్యార్థుల్లో రక్తహీనత గుర్తించేందుకు వైద్య పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాల పురోగతిపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ఎఎన్ఎంలు రక్తహీనత పోషకాహార లేమిని గుర్తించడంలో వైద్య పరీక్షలు సక్రమంగా నిర్వహించడం లేదన్నారు. దీనిపై ఎంఇఓలు క్షేత్రస్థాయి వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సక్రమంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తే వాటి నివారణకు అవసరమైన చర్యలు పటిష్టంగా చేపట్టేందుకు అవకాశాలు మెరుగు పడతాయన్నారు. ఈ అంశంపైనా ఆడిట్ నిర్వహిస్తామన్నారు. పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా రాగిజావతో పాటు 15 వెరైటీలతో వారానికి మెనూ అమలు చేస్తున్నప్పటికీ ఇంకా విద్యార్థులు రక్తహీనతతో పోషకాహార లోపంతో ఉంటున్నారని ఎందుకు రక్తహీనతతో ఉంటున్నారో కారణాలు అన్వేషించాలని ఎంఇఓలు దృష్టి సారించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ లో భాగంగా ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన కార్డులు ఆధార్ ద్వారా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. 0-6 మధ్య వయసుగల చిన్నారుల ఆధార్ డేటా ఎంట్రీ సత్వరంగా నిర్వహించాలన్నారు. నాడు-నేడు రెండో దశ కార్యక్రమాలకు నిధులు విడుదలయ్యాయన్నారు. నిర్బంధ ఉచిత విద్యా హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలుపరచాలని ప్రైవేట్ పాఠశాలల్లో (ఈడబ్ల్యూఎస్) లక్షిత వర్గాల చిన్నారులకు ఒకటవ తరగతిలో ప్రవేశాలు కల్పించాలని 25శాతం రిజర్వేషన్లను ప్రైవేటు పాఠశాలలో కచ్చితంగా అమలు పరచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇలు కె.చంటిబాబు, సిహెచ్ఎన్వి.కృష్ణారెడ్డి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి జివి.సత్యవాణి పాల్గొన్నారు.

1,620 కేజీల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని కోరుమిల్లిలో శ్రీవైష్ణవి ఫ్లోర్మిల్లులో శుక్రవారం విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు దాడి చేసి 1,620 కేజీల పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. రాజమహేంద్రవరం విజిలెన్స్ ఎస్పి రవికుమార్ ఆదేశాల మేరకు సిఐ వై.సత్యకిరణ్ ఆధ్వర్యంలో అధికారుల బృందం ఈ దాడులు చేసింది. 31 బస్తాల్లో ఉన్న 1,620 కేజీల పిడిఎస్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో విజిలెన్స్ తహశీల్దార్ విజయ్కుమార్, ఎంఎస్ఓ టి.సుబ్బరాజు, విఆర్ఓ సత్యసుబ్బలక్ష్మి, మహిళా పోలీస్ పి.రామతులసి పాల్గొన్నారు.

తప్పుడు కేసులు మోపడంపై ధర్నా

ప్రజాశక్తి - అమలాపురం

రాహుల్ గాంధీపై తప్పుడు కేసు నమోదుకు నిరసనగా పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆదేశాల మేరకు అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు కామన ప్రభాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం అమలాపురంలో గడియార స్తంభం వద్ద మహాత్మ గాంధీ విగ్రహానికి పూల మాల వేసి అనంతరం కలెక్టర్ ఆఫీసు వద్ద ధర్నా చేపట్టారు. హిందూపూర్లో రాహుల్ గాంధీపై బిజెపి నేతలు కుట్ర పన్ని, 2019లో రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారంలో తప్పు మాట్లాడారని, రాహుల్ గాంధీ రాజకీయ ఎదుగుదల చూసి ఓర్వలేక సూరత్ కోర్టు రెండేళ్ల కారాగార వేసిందని జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ అన్నారు. బిజెపి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ, బిజెపి నేతలు ఎన్ని కేసులు పెట్టినా, భయపెట్టినా బెదిరించినా దాడులు చేసినా, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భయపడరన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

కాట్రేనికోన : విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించొచ్చని దొంతికుర్రు సర్పంచ్ గెద్దడి ఈశ్వరి పేర్కొన్నారు. దొంతికుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు దాత కొప్పిశెట్టి శ్రీనివాసరావు సమకూర్చిన పరీక్ష అట్టలు, పెన్నులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సమావేశంలో మాజీ వైఎస్ఎంపిపి కాశి హనుమంతురావు, పిఎంసి చైర్మన్ కె.మహాలక్ష్మి, వైసిపి నాయకులు పాలెపు ధర్మారావు, జి.వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ యనమదల రామకృష్ణ, హెచ్ఎం వై.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సచివాలయం సేవలపై సమీక్ష

కాట్రేనికోన : కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, సర్వేయర్లు, జూనియర్ లైన్మెన్స్, ఎఎన్ఎంలతో స్థానిక ఎంపిడిఓ కార్యాలంలో ఎంపిడిఓ కె.కామేశ్వరరావు శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయనతో పాటు హౌసింగ్ ఎఇ కెవివిఎస్.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. 17 అంశాలపై సమీక్షా చేశారు. ప్రజలకు సేవలను వేగవంతంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, సచివాలయం సిబ్బంది ఉన్నారు

మణిమాలకు అభినందన

ఐ.పోలవరం : ఎపిపిఎస్సి హార్టీ కల్చర్ అధికారిగా ఎంపికైన జి.వేమవరానికి చెందిన రాయపురెడ్డి నవీణ మణిమాలను పలువురు అభినందించారు. సర్పంచ్ నల్లా సుదర్శనరావు, ఎంపిటిసి సభ్యురాలు లంకలపల్లి దుర్గారాణి, చోడిశెట్టి జ్యోతి తదితరులు అభినందించారు. సర్పంచ్ మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే ప్రభుత్వ ఉద్యోగం పొందటం అభినందనీయమన్నారు. మణిమాల మాట్లాడుతూ హార్టీకల్చర్ వత్తి విద్యాకోర్సును చేయడం తనకు కలిసి విచ్చుందన్నారు. అధ్యాపకుల ప్రోత్సాహానికి, తల్లితండ్రుల సహకారినికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల్లో మార్పు మొదలైంది : ఎంఎల్ఎ వేగుళ్ల

మండపేట : ఎంఎల్ఎ కోటాలో ఎంఎల్సిగా ఎన్నికైన పంచుమర్తి అనురాధ విజయంతో ప్రజల్లో మార్పు మొదలైందని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత మహిళా సోదరి విజయం అందరిదన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పంచారు. జగన్ నాయకత్వం నచ్చకపోవడంతోనే ఎంఎల్ఎలు అనురాధకు ఓటు వేశారన్నారు. ఈ సందర్భంగా పలువురు చేనేత ప్రముఖులు ఎంఎల్ఎను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, వాదా ప్రసాదరావు పాల్గొన్నారు.

ఎస్సిల్లో చేర్చడంపై హర్షం

అమలాపురం రూరల్ : దళిత క్రిస్టియన్లను ఎస్సిలో చేర్చడం పట్ల యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ హర్షం వ్యక్తం చేసింది. యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు, అమలాపురం మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు మొసలి స్పర్జన్ రాజు ఆధ్వర్యంలో శుక్రవారం అత్యవసరంగా సమావేశమై ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ఎం.ఏసుబాబు, ట్రెజరర్ రవిపాల్, నోబెల్ రాయ్, పాస్టర్లు పాల్గొన్నారు.

తాళ్లమ్మ తల్లిని దర్శించుకున్న 'బండారు'

కొత్తపేట : పలివెల గ్రామం కోటమెరకలో తాళ్ళమ్మ తల్లిని జనసేన పార్టీ కొత్తపేట నియోజకవర్గం ఇన్ఛార్జి బండారు శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బొక్క ఆదినారాయణ, కె.చంటి, సిహెచ్. సత్తిపండు, టి.రాజు, ఎం.బాబులు, ఎం.నాగభూషణం, జి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అనురాధ విజయంపై టిడిపి సంబరాలు

ప్రజాశక్తి - అంబాజీపేట

ఎంఎల్ఎ కోటాలో ఎంఎల్సిగా పంచుమర్తి అనురాధ విజయం పట్ల టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. అంబాజీపేట, పి.గన్నవరం సెంటర్లలో టిడిపి శ్రేణులు విజయోత్సవాలను ఘనంగా నిర్వహించాయి. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాగబాబు కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. పి.గన్నవరం సర్పంచ్ బొండాడ నాగమణి మాట్లాడుతూ ఇది అన్ని వర్గాల ప్రజల విజయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వక్కలంక బుల్లియ్య, రాష్ట్ర నాయకులు మోకా ఆనంద్సాగర్, అధ్యక్ష కార్యదర్శులు డి.శ్రీనురాజు, గూడాల ఫణి, డివివి.సత్యనారాయణ, జీవి రాఘవులు, ఎం.భారతి, మందపాటి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనురాధ గెలుపు ప్రజా విజయం: బుల్లియ్య

ఎంఎల్ఎ కోటాలో ఎంఎల్సిగా పంచుమర్తి అనురాధ సాధించిన విజయం ప్రజా విజయమని ఎన్టిఆర్ యువసేన అధ్యక్షులు, టిడిపి సీనియర్ నాయకులు వక్కలంక బుల్లియ్య అన్నారు. ఎంఎల్సి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి ఘన విజయం పట్ల పి.గన్నవరం, మామిడికుదురు, అంబాజీపేట, అయినవిల్లి ప్రధాన సెంటర్లలో మండల శాఖ అధ్యక్షులు ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుభద్రులు ఎన్నికల్లో మూడు స్థానాలు, ఎంఎల్ఎ కోటాలో పోటీ చేసిన ఒకే ఒక స్థానంలో టిడిపి ఘన విజయం సాధించిందన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని విజయపదంలో నిలబెట్టడమే అందరి కర్తవ్యమన్నారు.



ఉత్సాహంగా నాటిక పోటీలు

విశేష ఆదరణ చూపిస్తున్న కళాభిమానులు

ప్రజాశక్తి-రావులపాలెం

కోనసీమ ముఖద్వారమైన రావులపాలెంలో సిఆర్సి కాటన్ కళాపరిషత్ నిర్వహిస్తున్న 23వ ఉగాది నాటకోత్సవాల్లో ప్రదర్శిస్తున్న జాతీయ తెలుగు నాటికల పోటీలు ప్రేక్షకులకు కనుల విందు చేస్తున్నాయి. గతంలో ఏ రాష్ట్రంలోనూ ప్రదర్శించని కొత్త నాటికలు ఈ పోటీల్లో ప్రదర్శిస్తున్నారు. దీంతో రావులపాలెం పరిసర ప్రాంతాలకు చెందిన కళాభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి నాటికలను తిలకిస్తున్నారు. నాటిక ప్రదర్శన విరామ సమయంలో సినీనటులు గౌతమ్ రాజు, నయనాలు ప్రదర్శించిన పల్సర్ బండి పాటకు డ్యాన్స్ ఆద్యంతం ఆకట్టుకుంది. సిఆర్సి అధ్యక్షుడు తాడి నాగమోహన్రెడ్డి, పరిషత్ గౌరవ అధ్యక్షులు, సినీనటులు తనికెళ్ల భరణి చేతుల మీదుగా కళాకారులకు ప్రదర్శన పారితోషకాలు అందజేశారు. రావులపాలెంలో జాతీయ స్థాయి తెలుగు నాటికల పోటీల నేపథ్యంలో అటు కళాకారులు, ఇటు సినీ ప్రముఖులు, మరోవైపు ప్రేక్షకులతో సిఆర్సిలో పండుగ వాతావరణం నెలకొంది. సిఆర్సి రూపశిల్పి, కళాపరిషత్ కన్వీనర్ డాక్టర్ గొలుగూరు వెంకటరెడ్డి (విక్టరీ వెంకటరెడ్డి) ఆశయం మేరకు జరుగుతున్న ఈ పోటీల్లో మొదటి రోజైన బుధవారం రెండు నాటికలు ప్రదర్శించారు. రెండవ రోజైన గురువారం రాత్రి ఓరుగల్లు శారద నాట్యమండలి–వరంగల్ వారి 'ఫ్రీడమ్ ఫైటర్', కళాంజలి హైదరాబాద్ వారి 'రైతే రాజు', కాకినాడ శ్రీ సాయి కార్తిక క్రియేషన్స్ వారి 'ఎడారిలో వాన చినుకు' మొదలగు మూడు నాటికలు ప్రదర్శించారు. ఈ నాటిక పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.3 లక్షలు, రెండో బహుమతిగా రూ.2లక్షలు, మూడో బహుమతిగా రూ.లక్ష అందించనున్నారు. కళాకారులు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు నువ్వా నేనా అన్నట్లుగా పాత్రల్లో జీవిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.సి అధ్యక్షులు తాడి నాగ మోహన్ రెడ్డి, సి.ఆర్.సి ప్రధాన కార్యదర్శి కర్రి అశోక్ రెడ్డి, పరిషత్ డైరెక్టర్ కె. సూర్య, సిఆర్సి ఉపాధ్యక్షులు చిన్నం తేజారెడ్డి, కళాపరిషత్ నిర్వహణ పలివెల త్రిమూర్తులు, పరిషత్ పర్యవేక్షణ వెలగల సతీష్, డైరెక్టర్లు దండు వెంకటసత్యనారాయణరాజు, మల్లిడి ఆంజనేయ రెడ్డి(సిటీ అంజి), నల్లమిల్లి వీరరాఘవరెడ్డి, చిర్ల కనికిరెడ్డి, కర్రి సుబ్బారెడ్డి, కొవ్వూరు నరేష్ కుమార్ రెడ్డి, మన్యం ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.



కళాకారులకు జ్ఞాపికలు అందిస్తున్న సినీనటుడు, రచయిత తనికెళ్ల భరణి

'అనూస్' సేవలు వెలకట్టలేనివి

ఆత్రేయపురం : ర్యాలీకి చెందిన శ్యామ్ జాదూ గర్ మ్యాజిక్ ఫ్యామిలీ అనూస్ స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రజలకు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని అని ప్రముఖ సినీ నటుడు గౌతంరాజు అన్నారు. శుక్రవారం స్థానిక మ్యాజిక్ హౌస్లో శ్యామ్ సమకూర్చిన వేసవి తాపం తట్టుకోవడానికి విసిన కర్రలతో పాటు భోజన పొట్లాలు, ఎనర్జీ డ్రింక్స్ను ఆయన పేదలకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తాటాకు విసన కర్రలు చాలా ఆరోగ్యకరమైనవన్నారు. వీటి వల్ల పర్యా వణం కాపాడుకోవడంతో పాటు విద్యుత్ ఆదా చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధమాన కథానాయకురాలు నైన, శ్యామ్ జాదూ గర్ మ్యాజిక్ ఫ్యామిలీ సభ్యులు పాల్గొన్నారు.

'శ్రీచైతన్య టెక్నో స్కూల్ను రద్దు చేయాలి'

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం మండలం ద్రాక్షారామంలో శ్రీ చైతన్య టెక్నో స్కూలుకు ఎటువంటి గుర్తింపు లేదని, కాని నెల రోజులు నుంచి అడ్మిషన్లు కోసం యాజమాన్యం పరిసర ప్రాంతాల్లో ప్రచారం చేస్తుందని వెంటనే దీన్ని రద్దు చేయాలని పిడిఎస్యు జిల్లా నాయకులు బి.సిద్దు డిమాండ్ చేశారు. ద్రాక్షారామ లిటిల్ రోజ్ స్కూల్ దగ్గర శ్రీ చైతన్య టెక్నో స్కూల్ అని బోర్డు ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నారన్నారు. దీనిపై విద్యా శాఖ అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

పాలతోడులో ప్రత్యేక పారిశుధ్య పనులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - మండపేట

మండలంలోని పాలతోడులో ప్రత్యేక పారిశుధ్యపనులు చేపట్టారు. ఇటీవల గ్రామంలోని అంబేద్కర్ కాలనీలో మురుగునీరు ముందుకు పారకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. దీనికి అధికారులకు స్పందించారు. జెసిబి సాయంతో పరిసర ప్రాంతాలను శుభ్రపరిచి స్థానికులకు అవగాహన కల్పించారు. చెత్తాచెదరాలు డ్రెయినేజీలు, రోడ్లపై వేయకుండా ఇంటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు అందించాలని పంచాయతీ కార్యదర్శి ఎన్వి.రామారెడ్డి ప్రజలకు సూచించారు. ఈ మేరకు హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు

విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత

మండపేట : స్థానిక సంఘమేశ్వర కాలనీలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గత నెలలో క్రియ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్లో ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు హెచ్ఎం చిట్టూరి వెంకట శ్రీధర్ శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.

పశువుల డాక్టర్ను నియమించాలి

మండపేట : మండలంలోని ఏడిద పశు వైద్యశాలలో వైద్యుడిని నియమించాలని పలువురు రైతులు, పశుపోషకులు కోరుతున్నారు. గతేడాది జులై నుంచి ఈ పశువైద్యశాలలో వైద్యులు లేకపోవడంతో వెటర్నరీ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్లు వైద్య సేవలు అందిస్తున్నారు. జ్వరం, చూడి పరీక్షలు తదితర సేవలు అందిస్తుండగా శస్త్ర చికిత్సల కోసం మండపేటలోని రాష్ట్ర పశు సంవర్ధక శిక్షణా కేంద్రానికి తీసుకెళ్లాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. 2641 సెన్సెస్ కలిగిన ఈ గ్రామంలో పశు వైద్యులను నియమించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రైతులు అంటున్నారు. ఏడిద సీతానగరం, సావరం, కొత్తూరు తదితర ప్రాంతాలకు ప్రధానంగా ఉండే ఈ పశువైద్యశాలలో వైద్యున్ని నియమించేందుకు ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

విద్యార్థుల వైద్యానికి యువత ఆర్థిక సాయం

కాట్రేనికోన : గుండె వ్యాధి సమస్యతో బాధపడుతున్న కాట్రేనికోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు తిరుకోటి దివ్య, మల్లాడి వీరలక్ష్మిలకు చికిత్స నిమిత్తం రామస్వామితోటకు చెందిన మోకా దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు స్నేహితులు ఆర్థికంగా అండగా నిలిచారు. దుర్గాప్రసాద్ చొరవతో మంచి కోసం మేము సైతం హ్యూమానిటీ ఫోర్స్ పేరిట విదేశాలలో ఉన్న వారు సేకరించిన రూ.40 వేలు అందించారు. రూ.30 వేలను దివ్యకు, రూ.10వేలను వీరలక్ష్మికి అందించారు. దివ్య కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తిరుపతిలో ఉండడంతో ఆ నగదును పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వరరావుకు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాకే దానియేలు, ఎన్.సుధాకర్, యు.సూర్యారావు, గంటి ఆనందరావు, పాము స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో ఫుడ్ ఫెస్టివల్

మండపేట : మండలంలోని తాపేశ్వరం శ్రీచైతన్య స్కూల్లో శుక్రవారం ఫుడ్ ఫెస్టివల్ను ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల వంటకాలు, డ్రై ఫ్రూట్స్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. ఇటువంటి కార్యక్రమాలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాము, డీన్ అరుణ్, సి–ఇన్ఛార్జి లీలాకృష్ణ, ప్రైమరీ ఇన్ఛార్జి ఉమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంకంరెడ్డిని కలిసిన ఆదిత్య

మామిడికుదురు : వైసిపి గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు అంకంరెడ్డి నారాయణమూర్తిని జిల్లా గ్రీవెన్స్ అధ్యక్షులు కటకంశెట్టి ఆదిత్యకుమార్ విజయవాడ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. 2024 ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర అధ్యక్షులు సూచించారు. ఆయన వెంట రీజనల్ కన్వీనర్ పేరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



పొరపాటు సార్ ... అది అనుకూల శాతం అనుకుంటా..!!

ఆరోగ్యకర సమాజం కోసం పాటుపడాలి

ప్రకాశక్తి - యంత్రాంగం

ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవంలో భాగంగా జిల్లాలో వివిధ ప్రాంతాల్లో అవగాహనా ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. క్షయ బాధితులకు దాతలు పౌష్టికాహారం అందించారు. **ఆత్రేయపురం** మండలంలో పలు గ్రామాల్లో ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవంలో భాగంగా ర్యాలీలు నిర్వహించారు. పిహెచ్సి వైద్య అధికారులు సౌమ్య, ఆర్.దివ్యపావని మాట్లాడారు. ఆరోగ్యకర సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఆయా గ్రామాలలో దాతలు సమకూర్చిన పౌష్టికాహారాన్ని టిబి బాధితులకు అందించారు. **రామచంద్రపురంలో** కెవిఆర్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్షయ భాధితులకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ఆర్ఎంపి ఫెడరేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ కెవివి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వెల్ల ఆరోగ్య కేంద్రంలో గల టిబి బధితులకు వ్యాధి తగ్గే వరకు పోషకాహార కిట్లు పంపిణీ చేస్తామని సత్యనారాయణ ప్రకటించారు. కెవిఆర్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సేవా కార్యక్రమాలను వివరించారు. బాధితులకు గుడ్లు, నిత్యావసర వస్తువులు, పౌష్టికాహార సరుకులను, ఏరియా ఆసుపత్రి వైద్యుల చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.వీరభద్రుడు, టిబి సూపర్వైజర్ లీలా, డాక్టర్ ఆధినర్యన్, డాక్టర్ మమత వెల్ల ఆరోగ్య కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు** క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు పాటించాలని వైసిపి మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాసు అన్నారు. చెముడులంకలో క్షయ వ్యాధి నివారణపై ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి యు.రేణుక, నాయకులు దొండపాటి చంటి, మోటూరి సురేష్, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** మండలం అంగర పిహెచ్సి వద్ద వైద్యాధికారులు పి.రత్నకుమారి, అనూజ ప్రియాంక ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ క్షయవ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. **అయినవిల్లి** మండలం తొత్తరమూడి పంచాయతీ వద్ద సర్పంచ్ వారా జయసావిత్రి ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. విలసలో సర్పంచ్ కుసుమ లిల్లీమంగేష్కర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు, ఆశాలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు. **అంబాజీపేట** పుల్లేటికుర్రు రూరల్ డెవలప్మెంట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్షయ బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఐదుగురు బాధితులను దత్తత తీసుకున్నారు. తొలుత టీబీ డే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపిటిసి పి.రాంబాబు, మాజీ ఎంపిపి డివివి.సత్యనారాయణ, ట్రస్టీ సురేష్ కుమార్, కార్యదర్శి త్రిమూర్తులు పిహెచ్సి సిబ్బంది పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** మండలంలోని ఉప్పలగుప్తం, భీమనపల్లి పిహెచ్సిల పరిధిలో వైద్యాధికారులు డాక్టర్ ఎల్.నాగార్జున, ప్రసన్న ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ కడిమి చిన్నవరాజు, సిహెచ్ఓలు విజయలక్ష్మి, విప్పర్తి ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది, పాల్గొన్నారు.



రామచంద్రపురంలో క్షయ బాధితులకు పోషకాహార కిట్లు అందిస్తున్న సత్యనారాయణ

గుర్తించిన పనులను పూర్తి చేయాలి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో గుర్తించిన పనులను పూర్తి చేయాలని ఎంపిడిఓ నాతి బుజ్జి అన్నారు. శుక్రవారం మండల సమావేశంలో కార్యాలయంలో క్షేత్ర సహాయకులతో ఆమె సమీక్ష నిర్వహించారు. హౌసింగ్ లబ్ధిదారులకు 90 రోజులు పనిదానాలు కల్పించాలని, వాటిని మార్చి నేలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో నిర్దేశించిన లేబర్ బడ్జెట్ లక్ష్యాలను మార్చినెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. 2023–2024కు సంబంధించి అంచనాలు తయారు చేసి ఆమోదం తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎపిఓ విజయభారతి, ఇసి చక్రపాణి, సాంకేతిక సహాయకులు సత్యనారాయణ, అజయ్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



శ్రీరాంపురంలో క్లూస్ టీమ్‌తో గాలిస్తున్న పోలీసులు

దుర్గాంబిక ఆలయంలో 80 కాసుల బంగారం అపహరణ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

శ్రీరాంపురం గ్రామంలో ఉన్న దుర్గాంబిక ఆలయంలో సుమారు 80 కాసుల ఆలయ ఆభరణాలు శుక్రవారం చోరీకి గురైనట్లు కొత్తపల్లి ఎస్ఐ రామలింగేశ్వరరావు తెలిపారు. అమ్మవారి కిరీటం, మంగళ సూత్రం, చేతి హస్తం, హుండీని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు తెలిపారు. సీఐ వై ఆర్ కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు. దొంగలించిన హుండీని గ్రామ శివారు ప్రాంతంలో ఉన్నట్టు గుర్తించామని తెలిపారు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

బైకు ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం మురారిలో రోడ్డు దాటుతుండగా వ్యక్తిని మోటార్ సైకిల్ ఢీకొన్న సంఘటనలో తీవ్ర గాయాలయినట్లు గండేపల్లి ఎస్ఐ వై.గణేష్‌కుమార్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు పత్తిపాడు మండలం రాచపల్లి గ్రామానికి చెందిన ఎద్ద రామకృష్ణ మురారి సెంటర్లో బస్సు కోసం వేచి చూస్తూ వాటర్ బాటిల్ కొనడానికి రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో రాజానగరం వైపు నుండి గండేపల్లి వైపునకు మోటార్ సైకిలు నిర్లక్ష్యంగా నడుపుతున్న వ్యక్తి రామకృష్ణను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రామకృష్ణకు తలకు, కాళ్లకు గాయాలయ్యాయి. అతనిని కుటుంబ సభ్యులు రాజమండ్రి ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రామకృష్ణ చికిత్స పొందుతున్నాడని, ఈ మేరకు బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపారు.



గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

ప్రజాశక్తి - యానాం

యానాం పరిధిలో స్థానిక బైపాస్ రోడ్ బల్లా ట్రేడ్ సెంటర్ భవనం వద్ద గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం శుక్రవారం లభ్యమైందని ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. 60 నుండి 65 సంవత్సరాల మధ్య వయసు, తెలుపు రంగు, ఐదున్నర అడుగుల ఎత్తు ఉంటుందని ఆమెను గుర్తుపట్టినవారు యానాం పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని ఎస్ఐ శేరు నూకరాజు కోరారు.

యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం నీలపల్లి గ్రామానికి చెందిన మల్లాడి మల్లాడి బాబీ అన్న యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాస్ కుమార్ తెలిపారు. నీలపల్లిలోని స్థానిక చెక్ పోస్ట్ సెంటర్‌కు చెందిన బాబీ తండ్రి మృతి చెందడంతో వేటకు వెళ్లి తానే కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే డ్రగ్స్, మద్యానికి బానిసైన బాబీ గత ఐదు రోజులుగా ఎక్కువగా మద్యం సేవిస్తుండటంతో తల్లి మందలించింది. తల్లి బయటకు వెళ్లిన సమయంలో ఇంటి దూలానికి ఉన్న ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీవాస్ కుమార్ తెలిపారు.

యానాం వార్తలు



కుటుంబ సభ్యులతో కలిసి నిరసన తెలుపుతున్న ఓచర్ పెయిడ్ ఉద్యోగులు

వోచర్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలి

- కుటుంబ సభ్యులతో కలిసి సిబ్బంది నిరసన

ప్రజాశక్తి - యానాం

యానాం పుదుచ్చేరి వ్యాప్తంగా ప్రజా పనుల శాఖలో పనిచేస్తున్న ఓచర్ పెయిడ్ ఉద్యోగులు తమ వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ పుదుచ్చేరిలో తమ భార్య పిల్లలు, కుటుంబ సభ్యులతో కలిసి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో యానాం పిడబ్ల్యుడి కార్యాలయం వద్ద గత కొన్ని రోజులుగా నిరసన తెలియజేస్తున్న సిబ్బంది శుక్రవారం తమ కుటుంబ సభ్యుల పిల్లలతో కలిసి నిరసన తెలియజేశారు. పుదుచ్చేరి ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించిన రూ.15వేల జీతానికి అదనంగా రూ.3వేలు పెంచి రూ.18వేల జీతం ఇవ్వాలని, డైలీ రేటెడ్ చేయాలని, ఆ శాఖలో ఖాళీగా ఉన్న ఎంటిఎస్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు, ఓచర్ పెయిడ్ ఉద్యోగుల కుటుంబ సభ్యులు వారి పిల్లలు పాల్గొన్నారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ అశోక్

రీజెన్సీ ఫ్యాక్టరీ తెరిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి : ఎంఎల్ఏ

యానాంలో మూతబడిన వేలాది మందికి ఉపాధి కల్పించిన రీజెన్సీ సిరామిక్స్ ఫ్యాక్టరీని తెరిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఏ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో కోరారు. సముద్రంలో ఒఎన్ జిసి సంస్థ రెండవ గ్యాస్ పైపులైను వేస్తున్న నేపథ్యంలో వేట నష్టపోతున్న యానాం మత్స్యకారులకు రావాల్సిన పరిహారం ఆలస్యం కావడంపై పుదుచ్చేరి అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మత్స్యశాఖ మంత్రి లక్ష్మీనారాయణ సమాధానమిస్తూ యానాం ప్రాంత మత్స్యకారులకు సంబంధిత ఒఎన్‌జిసి సంస్థ నష్టపరిహారానికి సంబంధించి జిఒ ఈ ఏడాది ఫిబ్రవరి 15న జారీచేసిందన్నారు. పరిహారానికి మొత్తం 6,667 మంది దరఖాస్తు చేసుకున్నారని ఈ నేపథ్యంలో లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలనకు విలేజ్ లెవెల్ కమిటీలను నియమించినట్లు తెలిపారు. ఇప్పటివరకు ఆయా విలేజ్ లెవెల్ కమిటీల ద్వారా 50 శాతం విచారణ పూర్తయ్యిందన్నారు. మిగతా దరఖాస్తులు సైతం తనిఖీ చేసి దరఖాస్తుదారులకు పరిహారాన్ని ఆయా లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామని పేర్కొన్నారు. యానాంలో ఏళ్లతరబడి ఖాళీగా ఉన్న ఫిషరీస్ డైరెక్టర్ పోస్టు తదితరవాటిని భర్తీ చేయాలని ఎంఎల్ఏ అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దూరప్రాంత విద్యార్థుల కోసం క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనభత్యాలను మధ్యాహ్న పథకంను అక్షయపాత్ర ద్వారా ఇప్పటికే పుదుచ్చేరిలో అమలు చేస్తున్నారని యానాంలో అన్ని పాఠశాలలో అక్షయ పాత్ర పథకంను అమలు చేయాలని ఎంఎల్ఏ అశోక్ కోరారు.



ర్యాలిని ప్రారంభిస్తున్న ఆర్ఎఒ మునిస్వామి, డిడి రవిశంకర్

క్షయ నివారణపై అవగాహన ర్యాలీ

యానాం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నివారణపై శుక్రవారం అవగాహన ర్యాలీని ఆర్ఎఒ మునిస్వామి ప్రారంభించారు యానాం ప్రధాన వీధులలలో ర్యాలీ నిర్వహించి క్షయ వ్యాధి నివారణపై నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్లు క్షయ వ్యాధి లక్షణాలను వివరిస్తూ, నివారణకై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యశాఖ అధికారి డి.రవిశంకర్, ఎడి సన్యాల్, వేణు గోపాల్ రాజు,ఖాన్,ఆశా వర్కర్లు, నర్సులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా పిసిఎస్ అధికారి గోయల్

యానాం నియోజకవర్గంలో గవర్నర్ ఆదేశాల మేరకు నూతన మున్సిపల్ కమిషనర్‌గా పిసిఎస్ క్యాడర్ అధికారి ద్విజ్ గోయల్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ వర్మ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 21న అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక ఎంఎల్ఏ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ప్రస్తుత కమిషనర్‌ను ఉద్దేశించి అసెంబ్లీలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ అశోక్ గవర్నర్ తమిళసై సౌందర్య రాజన్, సిఎం రంగసామి, స్పీకర్ సెల్వంలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకృతి విపత్తులపై నేడు మాక్ డ్రిల్

ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై శనివారం స్థానిక బీచ్ రోడ్ లో భారత్ మాత విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు ఆర్ఎఒ మునిస్వామి తెలిపారు.ఈ సందర్భంగా ఆర్ ఏ ఓ మునిస్వామి ఆరోగ్య,ఫైర్, పోలీస్,ఎన్డిఆర్ఎఫ్ తదితర సిబ్బందితో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు.

తడి, పొడి చెత్తలను విడిగా సేకరించాలి

- డిఎల్‌పిఒ వై అమ్మాజీ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ప్రతీ గ్రామంలో తడిచెత్త పొడిచెత్తను వేరు చేసి కంపోస్టు తయారీ కేంద్రాలకు తరలించాలని కాకినాడ డివిజనల్ పంచాయితీ అధికారి వై అమ్మాజీ పిలుపునిచ్చారు. ఉండూరు గ్రామంలో ఎంపిక చేసిన లోకల్ ట్రైనింగ్ సెంటర్‌లో శుక్రవారం రెండో రోజు ఎంపిక చేసిన ఎఫ్‌కెపాలెం, చిత్రాడ తొండంగి, ఎవి నగరం గ్రామాలకు ఇన్‌చార్జి ఇవోపిఆర్డీ శ్రీహరి అధ్యక్షతన జరిగిన శిక్షణా తరగతుల్లో డిఎల్‌పిఒ అమ్మాజీ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి, తడి,పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలని చెప్పారు. శిక్షణకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, సిబ్బంది, తొండంగి ఇవోపిఆర్డీ ఎన్ సత్య ప్రసాద్, ఉండూరు గ్రామ సర్పంచి సత్యాడి ధనలక్ష్మి, ఉప సర్పంచి కొప్పిరెడ్డి రాధాకృష్ణ, గ్రామ కార్యదర్శులు కుమార్ రాజా, బుల్లియ్యకాపు, పంచాయితీల సిబ్బంది, క్లాపు మిత్రలు,తదితరులు మొత్తం 48 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా తడిపొడి చెత్తసేకరణపై గ్రామంలో ఎలా సేకరించాలో ప్రయోగాత్మకంగా వివరించారు.



రెండో రోజు శిక్షణకు హాజరైన పంచాయితీల సర్పంచిలు, సిబ్బంది

దళిత చైతన్య వేదిక సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించడానికి కుల మతాలకు అతీతంగా దళిత చైతన్య వేదిక చేస్తున్న సేవలు అభినందనీయమని రిటైర్డ్ ఎంఇఒ జొన్నలగడ్డ గోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం సాకుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దళిత చైతన్య వేదిక పే బ్యాక్ టు ద సొసైటీ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం వి.చక్రధర్‌రావు మాట్లాడారు. పరీక్ష సామగ్రి పంపిణీ హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, సమన్వయ కర్త బత్తుల జనార్ధనరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సోడదాసు బాబురావు, ప్రముఖ అంబేద్కర్ రచనల విశ్లేషకులు చిలకపాటి శ్రీధర్, ఉపాధ్యాయులు ఉప్పే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ జాతర

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక 2వ వార్డు పరిధిలోని బొమ్మల గుడి వీధిలో ఉన్న పోలేరమ్మ అమ్మవారి జాతర శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ ఉత్సవంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జానపద కళా రూపాలు ప్రదర్శించారు. కౌన్సిలర్ ఆకుల కృష్ణ బాపూజీ, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - యానాం

యానాం శివారు సావిత్రి నగర్ రోడ్డులో ఆర్‌ఐటి వద్ద శుక్రవారం రాత్రి ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తాళ్లరేవు మండలం గాడిమొగకు చెందిన జగడం నూకరాజు(40) భార్యతో సత్యవేణితోకలిసి బైక్‌పై వెళ్తున్నారు. ఆర్‌ఐటి వద్దకు వచ్చేసరికి సావిత్రి నగర్‌కు చెందిన దోమ సత్యం వేగంగా వచ్చి వీరి బైకును ఢీకొన్నాడు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాదు. సత్యవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ శేరు నూకరాజు, ట్రాఫిక్ ఎస్ఐ పువ్వల వీరభద్రస్వామి తెలిపారు.

శ్రీరామచంద్రమూర్తి మరణం తీరని లోటు


ప్రజాశక్తి - తాళ్లరేవు

డిసిసిబి మాజీ చైర్మన్ ఆకాశం శ్రీరామచంద్ర మూర్తి మరణం తీరని లోటని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు అన్నారు. కే.శే.ఎన్టీ రామారావు హయాంలో ఏకగవాక్ష విధానంలో ఆకాశం శ్రీరామచంద్రమూర్తి తూర్పుగోదావరి జిల్లా (డిసిసిబి) చైర్మన్ గా విధులు నిర్వహించి పలువురి మన్ననలు పొందారని తెలిపారు. ఆయన గుండెపోటుకు గురై మరణించడం బాధాకరమని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట పోతుల సుధాకర్ ఉన్నారు.

గోవలంక ఏటిగట్టుపై ప్రమాదం : నలుగురికి గాయాలు.

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్ళరేవు మండలం గోవలంక ఏటిగట్టుపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. యానం నుండి జొన్నాడ వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి గోవలంక వద్ద ఏటిగట్టు పైనుంచి కిందకు జారింది.ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు యానాం జి.జి.హెచ్. కు తరలించారు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



నైరోస్ టెక్నాలజీస్‌తో ఒప్పందం కుదుర్చుకుంటున్న ఆదిత్య ప్రిన్సిపాల్

'ఉద్యోగ గమ్యం చేరుకోవడం'పై శిక్షణ

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో కాకినాడ నైరోస్ టెక్నాలజీస్ వారి సౌజన్యంతో "ఉద్యోగ గమ్యాన్ని చేరుకోవడం' అనే అంశం పై ఒకరోజు శిక్షణా తరగతిని ఆ కంపెనీ అధినేత మంగళం పల్లి పవన్ కుమార్ నిర్వహించారు. నవీనయుగంలో విద్యార్థులు తమ ఉద్యోగ గమ్యాన్ని త్వరగా ఎలా చేరుకోవడం, అందులోని మెళకువలను వివరించారు. ఈ సందర్భంగా ఆదిత్య ఇంజ నీరింగ్ కాలేజీ నైరోస్ టెక్నాలజీస్‌తో ఎంఒయు కుదుర్చుకుంది. శిక్షణాశిబిరం ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస రెడ్డి, డీన్ అకడమిక్స్ ఎస్.రమాశ్రీ, విభాగధిపతి ఎ. వానతి, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం 180 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ తులసి మంగతాయారు

విద్యతోనే ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

విద్య ద్వారానే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని,ప్రతి విద్యార్థి విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు విద్యార్థులకు సూచించారు. స్థానిక జవహర్లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో 10 వ తరగతి చదువుతున్న119 మంది విద్యార్థులకు పరీక్షా సామగ్రిని ఆమె తులసి మంగ తాయారు పంపిణీ చేశారు. శుక్రవారం కొప్పుల వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పాశీలవారి వీధిలోని వెలమ కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో చైర్ పర్సన్ మంగతాయారు మాట్లాడారు. ఈ సందర్భంగా హై స్కూల్ అభివద్ధి కమిటీ చైర్మన్ అల్లు ప్రసాద్ మాట్లాడుతూ కొప్పుల వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా దాతలు పప్పల బుజ్జి,యాళ్ల వీరబాబు,తైనాల శ్రీనులు ఈ సామగ్రిని సమకూర్చారన్నారు సమావేశంలో వైద్యాధికారి శిరీష, జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, డైరెక్టర్లు లోవ కుమారి, లక్ష్మీనారాయణ, వైద్య సిబ్బంది ఉపాధ్యాయులు నూకరాజు, కమిటీ సభ్యులు బండారు సుధీర్ కుమార్, దుర్గాప్రసాద్, బొడ్డు రాజు పాల్గొన్నారు.